కోడ్ ముగిసింది..
ముసుగులు తొలగించండి



షాపూర్‌నగర్ చౌరస్తాలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి,ఇం దిరా గాంధీ విగ్రహాలకు ముసుగులు ఉన్న దృశ్యం

కుత్బుల్లాపూర్: ఎన్నికల కోడ్ ముగిసినా మహనీయులపై ఏర్పాటు చేసిన ముసుగులను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. లోక్‌సభ సాధారణ ఎన్నికల ప్రవర్తన నియమావళిని కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ఎత్తివేసినప్పటికీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో మాజీ ప్రధానులు, ఇతర రాజకీయ పక్ష నేతలు, మహనీయుల విగ్రహాలపై ఏర్పాటు చేసిన ముసుగులను తొలగించకపోవడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు. మార్చి 16వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉన్న విషయం తెలిసిందే. దీంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు అన్ని పనులు నిలిచిపోయాయి. ఎన్నికల సంఘం ప్రకటన చేయడంతో అసెంబ్లీ పరిధిలో ఎన్నికల ముందు నిలిచిపోయిన అభివృద్ధి పనులు వేగవంతం చేసే దిశగా అధికారులు ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగుతున్నారు. గడిచిన రెండు నెలలుగా ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్న సిబ్బంది కార్యాలయాలకు వచ్చి కొలువుదీరుతున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న కుంటి నాగరాజు

దుండిగల్: గ్రామ కంఠంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేత కుంటి నాగరాజు కోరారు. ఈ మేరకు శుక్రవారం దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో ఆయన ఫిర్యాదు చేశారు. గాగిల్లాపూర్ గ్రామంలోని 150 గజాల గ్రామ కంఠం భూమిలో కొందరు వ్యక్తులు అక్రమంగా కాంపౌండ్ వాల్‌తో పాటు బిల్డింగ్‌ను నిర్మిస్తున్నారని తెలిపారు. అక్కడే ఉన్న నీళ్ల బావిని మూసి వేశారని పేర్కొన్నారు. ఆక్రమణలను తొలగించి సదరు నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

స్థానిక సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కేఎస్ఆర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

నిజాంపేట్: ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో స్థానిక సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని కోరుతూ కేఎస్ఆర్‌కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు శుక్రవారం నిజాంపేట్ కమిషనర్ రామకృష్ణరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ... స్థానికంగా రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో సతమతం అవుతున్నామని అన్నారు. వర్షాకాలం నేపథ్యంలో పనులు పూర్తి చేయాలని కోరగా కమిషనర్ సానుకూలంగా స్పందించారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌కిరణ్, అజయ్, మౌలాలి తదితరులు ఉన్నారు.

సాగతీత పనులు... తాగునీరు రోడ్డుపాలు



ఎలీప్ చౌరస్తాలో మంజీర పైపులైన్ నుంచి వృథాగా పోతున్న తాగునీరు

నిజాంపేట్: రోజుల తరబడి మరమ్మతు పనులు సాగదీయడంతో విలువైన తాగునీరు రోడ్డు పాలవుతోంది. ప్రగతినగర్‌లోని ఎలీప్ చౌరస్తా సమీపంలో ఇటీవల మంజీర పైపులైన్‌కు లీకేజీ తలెత్తడంతో జలమండలి అధికారులు మరమ్మతు పనులకు పూనుకున్నారు. అయితే పనుల విషయంలో తాత్సర్యం చేయడంతో ప్రతిరోజు పైపులైన్ నుంచి భారీ ఎత్తున తాగునీరు వృథాగా పోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టి నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

మౌలిక సదుపాయాలను మెరుగు పరుస్తున్నాం



ఉషోదయకాలనీ పార్కులో వాకర్స్‌లో ముచ్చటిస్తున్న కార్పొరేటర్ రావుల శేషగిరి

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ ఉషోదయకాలనీ పార్కులో శుక్రవారం కార్పొరేటర్ రావుల శేషగిరి వాకర్స్‌తో ముచ్చటించారు. ఓపెన్ జిమ్‌లో కసరత్తు చేస్తున్న వారికి పలకరించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శేషగిరి మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరుస్తున్నామని అన్నారు. సమస్యలు లేని డివిజన్‌గా గాజులరామారంను తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్పొరేటర్ వెంట స్థానిక నాయకులు నవాబ్, సురేందర్‌రెడ్డి, మురళీకృష్ణ, నరసింహ, దూలప్ప, మధు, గుండురావు, శివారెడ్డి తదితరులు ఉన్నారు.

నాసిరకం.. మ్యాన్‌హోళ్ల నిర్మాణం

కొన్ని రోజులకు ధ్వంసమవుతున్న వైనం



ఆదర్శ్‌నగర్‌లోని లేన్ నెంబరు 14లో నాసికంగా మ్యాన్‌హోల్



జగద్గిరినగర్ రోడ్డు నెంబరు 9లో మ్యాన్‌హోల్ కుండికి రంధ్రం పడిన దృశ్యం

రంగారెడ్డినగర్: జలమండలి ఆధ్వర్యంలో చేపడుతున్న మ్యాన్‌హోళ్ల నిర్మాణం నాసిరకంగా ఉండటంతో అవి మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. పనుల సమయంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. భూగర్భ డ్రైనేజీ లైన్లు పూర్తయిన తరువాత పనుల నాణ్యత పరిశీలించకుండానే జలమండలి ఉన్నతాధికారులు బిల్లులు విడుదల చేయడం గమనార్హం. భూమి లోపల వేసే పైపులైన్ల నాణ్యత బయటకు కనబడకపోయినా, బయటకు వేసే మ్యాన్‌హోళ్ల నాణ్యత సైతం పరిశీలించడం లేదు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఆదర్శ్‌నగర్‌లో ఇటీవల పలు అంతర్గత రోడ్లలో భూగర్భ డ్రైనేజీ లైన్లను ఏర్పాటు చేశారు. అయితే కొన్ని చోట్ల మ్యాన్‌హోళ్ల మూతలు ఊడి పోతున్నాయి. అదే విధంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి జగద్గిరినగర్‌లో వేసిన భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను నాసిరకంగా చేపట్టడంతో మ్యాన్‌హోళ్ల కుండీలకు రంధ్రాలు పడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పనుల నాణ్యత విషయంలో కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బీజేపీలో నయా జోష్

- నిజాంపేట్ కార్పొరేషన్ పుంజుకున్న కమలం పార్టీ
- అసెంబ్లీ కంటే లోక్‌సభలో ఎక్కువ ఓట్లు రావడంతో కేడర్‌లో నూతనోత్సాహం
- బీజేపీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్న బీఆర్ఎస్ నేతలు



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌లో బీజేపీలో నయా జోష్ కనిపిస్తోంది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్ ప్రాంతాల్లో బీజేపీకి మెజారిటీ ఓట్లు రావడం పట్ల ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఫుల్‌జోష్‌లో ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువగా ఓట్లు రావడంతో పార్టీ కేడర్ నూతనోత్సాహంతో ఉంది. నిజాంపేట్ కార్పొరేషన్‌లోని మొత్తం 104 పోలింగ్ స్టేషన్లలోను బీజేపీకి ఆధిక్యత లభించడం విశేషం. పోలైన ఓట్లలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థుల కంటే ఎక్కువగా బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఈటల రాజేందర్‌కు రావడం పట్ల పార్టీ బోలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వచ్చిన మెజారిటీ కంటే ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి వచ్చిన మెజారిటీ ఎక్కువగా ఉండటం బీజేపీ శ్రేణులను ఉత్సాహం నింపుతోంది. పలువురు బీఆర్ఎస్ నాయకులు సైతం బీజేపీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది.

అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ పార్టీలకు వచ్చిన ఓట్లు..

◆ నిజాంపేట్ కార్పొరేషన్‌లోని నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్‌లోని మొత్తం 33 డివిజన్లల్లో వివిధ పార్టీలకు పోలైన ఓట్లు ఈ విధంగా ఉన్నాయి. కార్పొరేషన్‌లో మొత్తం ఓట్లు 1,34,718 ఓట్లు ఉండగా అందులో అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్లు 67,647 ఇందులో వివిధ రాజకీయ పార్టీలు సాధించిన ఓట్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన కెపి వివేకానందకు 28,751 ఓట్లు లభించాయి. ఇక కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన కొలను హన్మంత్‌రెడ్డికి పోలైన ఓట్లు 23,051, బీజేపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన కూన శ్రీశైలంగౌడ్‌కు 14,560 ఓట్లు లభించాయి. అంటే కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ నాడు 14,191 ఓట్ల మెజారిటీ సాధించింది.

లోక్‌సభ ఎన్నికల్లో పార్టీలకు లభించిన ఓట్లు...

◆ నిజాంపేట్ కార్పొరేషన్‌లోని 33 డివిజన్లలో లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటెల రాజేందర్‌కు మొత్తం 34,433 ఓట్లు లభించాయి. ఇక కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డికి 17,216 ఓట్లు వచ్చాయి. ఇక బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన రాగిరి లక్ష్మారెడ్డికి కేవలం 7,198 ఓట్లు మాత్రమే రావడం విశేషం.అయితే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌పై బీజేపీ ఏకంగా 17,217 ఓట్లు మెజారిటీ సాధించి నూతనోత్సాహంతో ఉంది.

ప్రజాప్రతినిధులు చేరిన ఫలితం దక్కలేదు..

◆ నిజాంపేట్ కార్పొరేషన్‌లో మేయర్ కొలను నీలా గోపాల్‌రెడ్డితో పాటు, సుమారు 10 మంది వరకు కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంపీ ఎన్నికల్లో ఓట్లు మాత్రం సాధించలేకపోయారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన కోలను హన్మంత్‌రెడ్డికి నిజాంపేట్ కార్పొరేషన్‌లో 28,751 ఓట్లు రాగ, ఎంపీ ఎన్నికల్లో ఈ ప్రాంతం నుంచి సునీతా మహేందర్‌రెడ్డికి కేవలం 17,216 ఓట్లు మాత్రమే లభించాయి. అంటే అసెంబ్లీ ఎన్నికల నాటి కంటే తక్కువ ఓట్లు కాంగ్రెస్ పార్టీ సాధించింది.

రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో సత్తా చాటుతాం...

◆ జనవరిలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు జరిగిన ఎన్నికల్లో తమ పార్టీ సత్తా చాటుతుందని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ ఎన్నికల్లో వచిృన ఫలితాలే మున్సిపల్ కార్పొరేషన్‌కు జరిగే ఎన్నికల్లో వస్తే తమ పార్టీదే అధికారం అనే భావనలో బీజేపీ నాయకులు ఉన్నారు. మరి ప్రజలు ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి వేసిన విధంగా ఓట్లు వేస్తారా? నాటి పరిస్థితులకు అనుగుణంగా ఓటు వేస్తారా.? అనేది వేచి చూడాల్సిందే. ప్రభుత్వం మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లను గ్రేటర్‌లో విలీనం చేసే అవకాశాలు కూడా లేకపోలేదు.

ఆర్థిక సాయం



చెక్కును అందజేస్తున్న మూడే రవినాయక్

జీడిమెట్ల: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవ ధర్మమని హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ మూడే రవినాయక్ అన్నారు. శుక్రవారం ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ ఏడీఈ జీవన్‌బాబు అందించిన రూ.5వేల చెక్కును రవినాయక్ సుభాష్‌నగర్‌లోని కృపా చిల్డ్రన్ హోం నిర్వాహకురాలు పద్మకు అందజేశారు.

విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి



పరమేష్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: విద్యుదాఘాతంతో ఓ పెయింటర్ మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌జిల్లా మద్దెలవాయి మండలం, హవేలి గ్రామానికి చెందిన పరమేష్(46) కుత్బుల్లాపూర్ పద్మానగర్ ఫేజ్–2లో ఉంటూ పెయింటింగ్ పనులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి భార్య కళావతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెయింటింగ్ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం పద్మానగర్ రింగ్ రోడ్డు సమీపంలోని ఓ భవనంలోని మొదటి అంతస్తులో రంగులు వేస్తుండగా కింది అంతస్తులో ఉన్న ఓ కిరాణా దుకాణానికి చెందిన బోర్డు అడ్డు వచ్చింది. దాన్ని తీసే క్రమంలో సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లకు తాకడంతో పరమేష్ షాక్‌కు గురయ్యాడు. కిందపడిపోయిన అతడిని వెంటనే ఇంటి యజమాని పేట్‌బషీరాబాద్ సమీపంలోని వెల్‌నెస్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే వివేకానంద్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో పలు సంక్షేమ సంఘాల నాయకులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. అదే విధంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు శుభకార్యాలకు రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు.

మైనార్టీ విద్యార్థులు రెసిడెన్షియల్ పాఠశాలలో చేరాలి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని మైనార్టీలు రెసిడెన్షియల్ పాఠశాలలో చేరాలని కోరుతూ మైనార్టీ కమిటీ సభ్యులు శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు మాట్లాడుతూ.. మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు పేద పిల్లలకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. మైనార్టీ విద్యార్థులు రెసిడెన్షియల్ పాఠశాలలో చేరాలని కోరారు.

నూతన విద్యా విధానం ప్రకారం బోధన చేయాలి



ఉపాధ్యాయును ఉద్దేశించి మాట్లాడుతున్న కోటిరెడ్డి

జీడిమెట్ల: నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఉపాధ్యాయుడు నూతన విద్యా విధానం ప్రకారం బోధన చేయాలని టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి.కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థులు జీవిత విలువలతో పాటు చక్కటి క్రమశిక్షణ అలవర్చుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థి సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి అర్థమయ్యేలా బోధన చేయాలని కోరారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుని పాత్ర చాలా గొప్పదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా 2023–24 విద్యా సంవత్సరంలో 10జీపీఏ పాయింట్లు సాధించిన విద్యార్థులతో పాటు వారికి బోధన చేసిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలు

కుత్బుల్లాపూర్: సుభాష్‌నగర్‌లోని వివేకానంద విద్యామందిర్ హైస్కూల్‌లో శుక్రవారం ఉపాధ్యాయులకు వైద్య శిబిరం నిర్వహించారు. శివ డయాగ్నోస్టిక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో బీపీ, డయాబెటీస్, దంత, కంటి పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు ప్రతి సంవత్సరం వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు ఆరోగ్యంగా ఉంటేనే మంచిగా బోధిస్తారని తెలిపారు. అలాంటప్పుడే విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారని పేర్కొన్నారు. ఈ శిబిరంలో కరస్పాండెంట్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ లత, శివ డయాగ్నోస్టిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వివేకానంద్ విద్యామందిర్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

శాంతియుత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశం

సుభాష్‌నగర్: బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూరారం ఇన్‌స్పెక్టర్ వెంకటేశం అన్నారు. ఈనెల 17న బక్రీద్ పండుగను పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం సూరారం పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తామన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

హైటెక్స్‌లో పెరల్, జెమ్ ఫెయిర్ ప్రారంభం



మాదాపూర్: సాంస్కృతిక వారసత్వంలో రత్నాలు, ఆభరణాల ప్రాముఖ్యత ఎక్కువ అని ఇండియా ఇన్ఫార్మా మార్కెటింగ్ మేనేజింగ్ డైరెక్టర్ యోగేష్ ముద్రాస్ తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న హైదరాబాద్ జువెలరీ పెరల్, జెమ్ ఫెయిర్ (హెచ్‌జెఎఫ్) 2024ను శుక్రవారం హైదరాబాద్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పరిమళ హనానూతన్, అసోసియేషన్ అధ్యక్షులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2030 నాటికి రత్నాలు, ఆభరణాల ఎగుమతులను యూఎస్ 75 బిలియన్ డాలర్లకు(రూ.6.2 లక్షల కోట్లు) పెంచాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌జెఎం అధ్యక్షుడు మహేందర్ తాయల్, జంట నగరాల జువెలరీ అసోసియేషన్ అధ్యక్షుడు కైలాస్ చరణ్, తెలంగాణ బులియన్ జెమ్, జువెలరీ ఫెడరేషన్ అధ్యక్షుడు జగదీశ్ పర్షద్ వర్మ, ఎగ్జిబిషన్ కనీవ్వనర్ ముఖేష్ అగర్వాల్, తెలంగాణ పాన్ బ్రోకర్ జువెలరీ అసోసియేషన్ అధ్యక్షుడు పరస్మల్ రాంకా తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

చింతల్: జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఆస్పత్రి సహాయ సహకారాలతో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. భగత్‌సింగ్‌నగర్‌లోని జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, ఫిజియోథెరపీ తదితర పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 83094 47458.

9న కూచిపూడి నృత్యప్రదర్శన

రాయదుర్గం: నాట్యగురువు ఉషా గోరేటి ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన యువ ప్రజ్ఞాశాలి ధృతి ముదిగొండ నృత్యప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో సాయంత్రం 4 గంటలకు నృత్య ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

10న ఏజీ వర్సిటీ స్నాతకోత్సవం

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆరవ స్నాతకోత్సవంను ఈ నెల 10 సోమవారం నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి ఇంచార్జీ ఉపకులపతి ఎం రఘునందన్‌రావు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్, భారతీయ స్టేట్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ చెల్లా శ్రీనివాస్‌శెట్టి పాల్గొంటారన్నారు .ఇందులో 587 మంది విద్యార్థులకు అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను,165 మంది విద్యార్థులకు పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీలని అందజేయనున్నట్లు తెలిపారు.వీరితో పాటు పీజీ ,పీహెచ్‌డీ,యూజీ విద్యార్థులకు బంగారు పతకాలు అందజేయనున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ,బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపల్ మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆసక్తి గల విద్యార్థులు ప్రవేశంకోసం జూన్ 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

గ్రూప్ 1 పరీక్షలకు ఆర్‌టీసీ బస్సులు సిద్ధం

మూసాపేట: కూకట్‌పల్లి డిపో నుంచి గ్రూప్ 1 పరీక్ష కేంద్రానికి అన్ని రూట్‌లలో ఆర్‌టీసీ బస్సులు నడుపుతున్నామని కూకట్‌పల్లి డిపో మేనేజర్ ఇషాక్ బిన్ మహమ్మద్ తెలిపారు. ఒకే ప్రాంతం నుంచి సుమారు 30 మంది అభ్యర్థులు ఉంటే 1.5 ఫెయిర్ ఛార్జీతో బస్సులు సెంటర్ వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ట్రాఫిక్‌లో ఇబ్బందులు పడకుండా పరీక్ష కేంద్రం వరకు బస్సులు నడిపిస్తున్నామని, గ్రూప్ 1 పరీక్ష రాసే అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

అవగాహన సదస్సు

ఏజీవర్సిటీ: మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వివిధ పంటలలో కలుపు యాజమాన్య పద్ధతులలో నూతన పోకడలను అనుసరించాలని మొక్కజొన్న శాస్త్రవేత్త డాక్టర్ ఆర్‌కే మాలిక్ అన్నారు.శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పంటల కలుపు యాజమాన్యంపై మూడు రోజుల అవగాహన సదస్సును నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు కలుపు మొక్కల నివారణపై పరిశోధకులకు పలు సూచనలు చేశారు.

తెల్లరేషన్ కార్డు ఉన్నవారు విద్యుత్ బిల్లు చెల్లించొద్దు

ఘట్‌కేసర్: తెల్లరేషన్ కార్డు ఉన్న వారంతా విద్యుత్ బిల్లులు చెల్లించొద్దని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించే లబ్ధిదారులు గృహజ్యోతి పథకం కింద దరఖాస్తు చేసుకున్నవారు, జీరో బిల్లు రాకున్నా బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కొంత మంది అమాయకుల దగ్గర బిల్లులు వసూలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ధాన్యం కొనుగోళ్లు..
13,520 మెట్రిక్ టన్నులే..

- రూ.29.78 కోట్లకు గానూ.. రైతులకు చెల్లించిన ధాన్యం సొమ్ము రూ.25.78 కోట్లు
- మేడ్చల్‌లో ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం 20 వేల మెట్రిక్ టన్నులు
- 12 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు.. పెరిగిన వరి సాగుతో అధిక ఉత్పత్తులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: రైతు పండించిన వరి పంట ఉత్పత్తులకు సంబంధించిన ధాన్యం 13,520 మెట్రిక్ టన్నులను జిల్లా పౌర సరఫరాల సంస్థ కొనుగోలు చేసింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పెరిగిన వరి పంట సాగునకు అనుగుణంగా ఉత్పత్తులు పెరగడంతో.. ఈ సీజన్‌లో రైతుల నుంచి 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల లక్ష్యంగా 12 కేంద్రాలను ప్రారంభించింది. జిల్లాలో నిర్దేశించిన కొనుగోలు కేంద్రాలైన ప్రతాప్‌సింగారం, ఏదులాబాద్, మాదారం, కేశవరం, లక్ష్మాపూర్, ఉద్దమర్రి, కీసర, శామీర్‌పేట్, మేడ్చల్, డబీల్‌పురా, పూడూరు, అలియాబాద్‌లలో 2,377 మంది రైతుల వద్ద నుంచి ఇప్పటి వరకు 13,520 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని జిల్లా పౌరసరఫరాల సంస్థ ఖరీదు చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో 12 కేంద్రాల ద్వారా గ్రేడ్ ఏ, కామన్ ధాన్యాన్ని కొనుగోలు చేశారు. జిల్లాలో 2,377 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యానికి సంబంధించి చెల్లించాల్సిన సొమ్ము రూ.29.78 కోట్లు కాగా, ఇప్పటి వరకు 2045 మంది రైతులకు రూ.25.78 కోట్లు అందజేశారు. మిగతా 322 మంది రైతులకు రూ.3.99 కోట్లు చెల్లించాల్సి ఉందని, రెండు రోజుల్లో సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో ధాన్యం సొమ్ము జమ కాగలదని జిల్లా పౌరసరఫరాల సంస్థ జీఎం రాజేందర్ తెలిపారు.

పెరిగిన వరి పంట సాగు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఈ ఏడాది యాసంగి సీజన్‌లో 13,454 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేయగా, 38 వేల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు(ధాన్యం) వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 12 కేంద్రాల ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది.

గతేడాది 19,386 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే..

గతేడాది యాసంగి సీజన్‌లో మేడ్చల్ జిల్లాలో 13,342 ఎకరాల్లో రైతులు వరి పంట సాగుచేయగా, 38 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రాగలదని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన సివిల్ సప్లై సంస్థ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో 4,028 మంది రైతుల నుంచి 19,386 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. అలాగే సదరు రైతులకు ధాన్యానికి సంబంధించిన మొత్తం సొమ్ము రూ.39.93 కోట్లు చెల్లించారు.